ఉత్తర ద్వార దర్శనం చేసుకున్న ప్రణవ్ గోపాల్

విశాలాంధ్ర - విశాఖ: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వీఎంఆర్డీఏ చైర్ పర్సన్ ఎంవి ప్రణవ్ గోపాల్ శుక్రవారం వేకువజామున సింహాచలం ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. మేళ తాళాలు, మంత్రోచ్చారణల మధ్య ఆలయం చుట్టూ జరిగిన ఉత్సవ మూర్తుల ఊరేగింపులో పాల్గొన్నారు. అంతరాలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉత్తర ద్వార దర్శనం అద్భుతమైన అనుభూతిని ఇచ్చిందని చెప్పారు. స్వామి కరుణా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలన్నారు. అనంతరం మురళీనగర్ వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. స్వామికి ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఉక్కుపై కూటమి స్పష్టమైన వైఖరి ప్రకటించాలి

విశాలాంధ్ర - గాజువాక : విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ పై కూటమి పాలకులు స్పష్టమైన వైఖరి ప్రకటించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ డిమాండ్ చేసారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా కూర్మ న్న పాలెం కూడలిలో చేపడుతున్న రిలే దీక్షలు శుక్ర వారం 1429 వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరం లో ఎల్ ఎం ఎం , డబ్లూ ఆర్ ఎం -1 , ఎం.ఎం .ఎస్ .ఎం , డబ్ల్యూ.ఆర్.ఎం -2, ఎస్.బి.ఎం ,ఎస్ టి ఎం విభాగాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి ఆదినారాయణ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఉక్కు కర్మాగారం ను కాపాడుతామని వాగ్దానాలను ఇచ్చిన కూటమి ప్రజా ప్రతినిధులు నోరు మెదకపోవడం దారుణ మన్నా రు . ఉక్కు పరిరక్షణ కోసం వామపక్షాల పార్టీలకు చెందిన నేతలు,కార్యకర్తలు పోరాడు తున్నారని అన్నారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని చేపట్టి కేంద్రానికి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఇంకా ఈ దీక్షల్లో ఏఐటీయూసీ నాయకులు డి.దేముడు, జి.ఆనంద్, డి.రమేష్, ఎం.కె.వి రాజేశ్వరరావు, వర్మ, మోహన్ కుమార్, త్రినాథ్, సీతా రామ రాజు, వి. కృష్ణం నాయుడు, బాషా, సి. ఐ.టి యూ నాయకులు ఎస్. రామా రావు, వై.టి.దాస్, కార్మిక సంఘాల నాయకులు సి.హెచ్ సన్యాసి రావు, దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కన్నుల పండుగగా వైకుంఠ ద్వార దర్శనం

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం కనుల పండువగా జరిగింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా సింహాచలం క్షేత్రంలో శుక్రవారం తెల్లవారుజామున ఉత్తర ద్వార దర్శనం వైభవోపేతంగా జరిగింది. సింహాద్రి అప్పన్న స్వామి ఆలయ ఉత్తర గోపురంలో వైకుంఠనాథుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు, సుధా గజపతి, ఊర్మిళ గజపతి, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాస్, గణబాబు, వి.ఎం.ఆర్.డి.ఏ చైర్మెన్ ప్రణవ్ గోపాల్ తదితర ప్రముఖులు ఉత్తర ద్వారా దర్శనం చేసుకున్నారు. స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి విశేష పూజలు నిర్వహించి కార్యనిర్వహణాధికారి వి.త్రినాధరావు ఆదేశాల మేరకు ఉత్తర ద్వారంలో దర్శన భాగ్యంను భక్తులకు అధికారులు కల్పించారు. భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. ఉత్తర ద్వారంలో స్వామివారి ఉదయం 11:30 వరకు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆదిశేష వాహనంపై ఉభయ దేవరులతో స్వామి భక్తులకు స్వామికి వైభవంగా తిరువీధి నిర్వహించారు.

ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తజనం

విశాలాంధ్ర - సాగర్‌నగర్: ఋషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం (టీటీడీ)కి శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా నిర్వహించిన ఉత్తర ద్వార దర్శనానికి వేలాది మంది భక్తులు శ్రీవారి దర్శించుకున్నారు. వేకుజామున 3:30 నిమిషాల నుండి సర్వదర్శనాలు ప్రారంభమయ్యాయి. రాత్రి పది గంటల వరకు నిర్వహించిన దర్శనాలకు ఉత్తరాంధ్ర నలుమూలల నుండి భక్తులు చేరుకుని శ్రీవారి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ వర్ణాల పూలతో అతి సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలో భాగంగా పెద్ద ఎత్తున క్యూ లైన్లుని ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు ఆలయ ఏఈఓ జగన్మోహన్ ఆచార్యులు పరివేక్షించారు. ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, శ్రీహరి సేవకుల కోలాటాలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెంకటరమణ, ఆలయ ఇన్‌స్పెక్టర్లు శివకుమార్, కిషోర్, శ్రవణ్, టిటిడి అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు

ప్రతిభ హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంత పరిధి 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలో గల ప్రతిభ హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ప్రిన్సిపల్ తోనంగి వెంకట రమణి ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు సంక్రాంతి సంబరాల విశేషాలు వివరించారు. విద్యార్థులు సాంప్రదాయ వేషధారణతో అలరించారు.

ట్వింకిల్ విద్యానికేతన్‌లో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: ట్వింకిల్ విద్యానికేతన్‌లో సంక్రాంతి సంబరాలు ఎంతో ఘనంగా జరిగాయి. ప్రిన్సిపల్ బి.శాంతి మాట్లాడుతూ ఈ సంక్రాంతి పండుగను రైతులు ఎంతో ఘనంగా జరుపుకుంటారని చెప్పారు. వరి ధాన్యాన్ని కుప్పలుగా పోసి లక్ష్మీదేవిని పూజిస్తారని, పూర్వకాలంలో వరి కంకులను పక్షులు తినడానికై ఇంటి దూలాలకు కట్టేవారని అన్నారు. ఈ పండుగకు కుటుంబీకులు అందరూ కలిసి ఎంతో ఘనంగా జరుపుకుంటారని చెప్పారు. పరమాన్నం తయారు చేసి పిల్లలందరికీ ప్రసాదంగా పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీచర్లు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈమంది పైడిరాజు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: కూటమి ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలపై దృష్టిసారించాలని తమ పెండింగ్ పిఆర్‌సి, డీఏలను విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈమంది పైడిరాజు డిమాండ్ చేశారు. విశాఖ జిల్లా ఎస్టీయూ కౌన్సిల్ సమావేశం గురువారం డాబాగార్డెన్స్ దరి నెల్లూరు మెస్ సమావేశ మందిరంలో జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిరాజు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై దృష్టిసారించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ,డీఏల విడుదల విషయంలో పూర్తిగా ద్రోహం చేసిందని అన్నారు. కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకుని ఉద్యోగ, ఉపాధ్యాయులు కూటమి ప్రభుత్వానికి పూర్తి మద్దతు ఇచ్చారని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆశగా ఎదురు చూస్తున్న పీఆర్సీని త్వరగా అమలు చేయాలని, అంతవరకు ఐఆర్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గత 5 సంవత్సరాల నుండి డీఏలు పూర్తిగా మరిచిపోయామని, పెండింగ్ డీఏలు మంజూరు చేయాలని కోరారు. ఉపాధ్యాయులు వారి అవసరాలకు దాచుకొన్న పీఎఫ్, ఏపీ జిఎల్ఐ వంటి వాటిని కూడా పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జి.ఓ. నెంబర్ 117 రద్దు చేయడం ద్వారా ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియజేసారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను గాడిలో పెట్టి ప్రభుత్వ పాఠశాలల పట్ల ఆదరణ కల్పించే విధంగా ప్రభుత్వం మరియు విద్యాశాఖామంత్రి నిర్ణయాలు తీసుకోవడం, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశాలకు ఏర్పాటు చేసి చర్చించి నిర్ణయాలు తీసుకోవడం అభినంద నీయమని, అదే విధంగా క్రింద స్థాయిలో సాధక బాధకాలు కూడా తెలుసుకొని నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా చంద్రంపాలెం జిల్లాపరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న చుక్కల స్వామిని ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. రానున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎస్టీయూ విశాఖపట్నం మద్దతు త్వరలోనే ప్రకటిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కల స్వామి, ఇమంది పైడిరాజు, రాష్ట్ర కౌన్సిలర్ జగదీష్ బాబు, మహిళా కార్యదర్శి కె.సునీత, వైస్ ప్రెసిడెంట్స్ రామకృష్ణ, స్వామి నాయుడు అసోసియేట్ అధ్యక్షులు జి.వరహాలు దొర, ఉపాధ్యా యులు కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

శెభాష్ నితీష్.. ఆటతీరు అద్భుతం

- దేశానికి కీర్తి ప్రతిష్టలు పెంచేలా కృషి చేయాలి
- అభినందించిన ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ బాబు

విశాలాంధ్ర - పీఎం పాలెం: మెల్‌బోర్న్ వేదికగా జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో సెంచరీతో ఉత్తమ ఆటతీరు కనబరిచి అందరి దృష్టినీ ఆకర్షించిన విశాఖపట్నంకు చెందిన యువ క్రికెటర్ నితీశ్ కుమార్‌రెడ్డిని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యదర్శి సానా సతీష్‌బాబు ప్రత్యేకంగా అభినందించారు. ఆస్ట్రేలియా పర్యటన ముగించుకొని వైజాగ్‌కు వచ్చిన నితీశ్ కుమార్‌రెడ్డి విశాఖలోని వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శుక్రవారం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యదర్శి సానా సతీష్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇంగ్లాండ్-ఇండియా టీ20 మ్యాచ్ సిరీస్, ఛాంపియన్స్ ట్రోఫీలకు కూడా సెలెక్ట్ అవుతారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తన ఆట తీరుతో భవిష్యత్తులో రెట్టింపు ఉత్సాహంతో ఉత్తమ ప్రతిభతో విజయాలు నమోదు చేసి ఇటు రాష్ట్రానికి, అటు దేశానికి, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌కు కీర్తి ప్రతిష్టలు పెంచేలా కృషి చేయాలని ఆ దిశగా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ తరవున పూర్తి సహాయ సహకారాలు, తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల జరిగిన మెల్‌బోర్న్ టెస్ట్ మ్యాచ్‌లో నితీశ్‌కుమార్‌రెడ్డి అద్భుతమైన బ్యాటింగ్‌తో సెంచరీ చేసి భారత్ జట్టును ఆదుకున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో ఏసీఏ వైస్ ప్రెసిడెంట్ పి.వెంకట రామ ప్రశాంత్, కౌన్సిలర్ దంతు గౌర్ విష్ణు తేజ్, ఏసీఏ గేమ్ డెవలప్‌మెంట్ జనరల్ మేనేజర్ ఎం.ఎస్.కుమార్, అసిస్టెంట్‌జనరల్ మేనేజర్ డి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించండి: సోమన్నారాయణ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు వినియోగించరాదని, జనవరి 1 నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధించినందున, ప్రత్యామ్నాయ వస్తువులను అందరూ వినియోగించాలని, ఆ దిశగా సామాజిక మాధ్యమ ప్రభావితులు (సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్) సామాజిక బాధ్యతతో సోషల్ మీడియా ద్వారా ప్రజలకు, వ్యాపారులకు విస్తృత అవగాహన కల్పించాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ కోరారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో తన చాంబర్లో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్. ఇ.ఎన్.వి.నరేష్ కుమార్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ అదనపు కమిషనర్ మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలో జనవరి 1వ తేదీ నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించడమైనదని, అందులో భాగంగా సోషల్ మీడియా ద్వారా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నకు బదులుగా ప్రత్యామ్నాయమైన, పర్యావరణహితమైన వస్తువులు విరివిగా అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి దుకాణదారునికి ప్లాస్టిక్ నకు బదులు ప్రత్యామ్నాయ వస్తువులు అమ్మకాలు జరిపే వ్యాపారుల ఫోన్ నెంబర్లు ఇప్పటికే అందించామని తెలిపారు. ఉదాహరణకు ప్రస్తుతం వినియోగిస్తున్న టీ కప్పులు కూడా కాగితం కప్పులు వలే కనిపిస్తున్నప్పటికీ అందులో కూడా ప్లాస్టిక్ పొర ఉంటుందని ప్రాక్టికల్ గా అదనపు కమిషనర్ వారికి ప్రదర్శించి వివరించారు. అందువలన ఒకసారికి వినియోగించి పారవేసే ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా స్టీలు, గాజు, పింగాణి, పేపర్, వస్త్ర ,నార తదితర ప్రత్యామ్నాయమైన వస్తువులను వినియోగించేలా సోషల్ మీడియాలో ప్రచారం కల్పించాలని కోరారు. అలాగే ప్రజలలో అవగాహన, సమాచారం కొరకు సోషల్ మీడియా ప్రభావితులతో కలిపి ఒక వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేస్తామని, ఏ ప్రాంతంలోనైనా ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తున్న దుకాణాదారుల వీడియో లేదా ఫొటోలను గ్రూపుల్లో పెట్టినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని తెలిపారు. తద్వారా నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగం పూర్తిగా నిర్మూలన జరుగుతుందన్నారు. నిషేధిత ప్లాస్టిక్ పై విస్తృత ప్రచారం చేపట్టేందుకు సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్ సహకారం జీవీఎంసీకి అవసరమని వారికి తెలిపారు.

రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్న చంద్రబాబు: ఎమ్మెల్యే గంటా

విశాలాంధ్ర - పీఎం పాలెం: వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా మారిన రాష్ట్రాన్ని తనకున్న అపారమైన రాజకీయ అనుభవం గల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గాడిన పెడుతున్నారని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 7 వ వార్డులో రూ.5 కోట్లతో ప్రతిపాదించిన రోడ్లు, డ్రెయిన్లు, పార్కు పనులకి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 5 ఏళ్ల జగన్ హయంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్టిన దాఖలాలు లేవని విమర్శించారు. 2014-19లో తాను మంత్రిగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో రూ.4,500 కోట్ల అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. ఎంతో నమ్మకంతో తనను భారీ మెజారిటీతో గెలిపించారని, ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టు అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల హామీలను అమలు చేయడంపై దృష్టి సారించామని, ఉగాది నుంచి మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, వచ్చే విద్యా సంవత్సరం నుంచి తల్లికి వందనం పథకాలు అమలు చేయనున్నామని వెల్లడించారు. చంద్రం పాలెం ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు తొందర్లోనే మొదలవుతాయని, మాస్టర్ ప్లాన్ రోడ్లు కూడా త్వరితగతిన చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. భీమిలి రోడ్ల విస్తరణ పనులు, మంచినీటి సరఫరా ప్రాజెక్టులను ప్రాధాన్య క్రమంలో చేపట్టనున్నట్లు తెలిపారు. వార్డులో హౌసింగ్ ప్రతిపాదనలు చేస్తున్నామని, అర్హులందరికీ సొంతింటి కల నెరవేరుస్తామన్నారు. 5, 6, 7 వార్డుల పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత దుస్తులను గంటా చేతుల మీదుగా టీడీపీ సీనియర్ నాయకుడు నాగోతి సత్యనారాయణ అందజేశారు. 7 వ వార్డు కార్పొరేటర్ పిల్లా మంగమ్మ, 8 వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, కూటమి నాయకులు మొల్లి లక్ష్మణరావు, పిల్లా వెంకట్రావు, వాండ్రాసి అప్పలరాజు, శాఖారి శ్రీనివాస్, గరే గుర్నాథ్, పాసి త్రినాథ్, పిల్లా నరసింగరావు, దాసరి శ్రీనివాస్, నాగోతి లక్ష్మీ నాయుడు, పసుపులేటి శ్రీనివాస్, మామిడి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి ఘనంగా సంక్రాంతి వేడుకలు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: మకర సంక్రాంతి ఉత్సావాలను ఈ నెల 12వ తేదీ ఆదివారం నుంచి 15వ తేదీ బుధవారం వరకు ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజ్ మైదానంలో అత్యంత వినోదాత్మకంగా, పండగ వాతావరణం లో నిర్వహిస్తామని బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవిఎల్ నరసింహా రావు పేర్కొన్నారు. ఈ పండుగ వేడుకల ప్రారంభోత్సవ పూజా కార్యక్రమం శుక్రవారం ఎయూ ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షణం తీరిక లేకుండా జీవనం గడుపు తున్న నగర ప్రజలకు గ్రామీణ వాతావరణం ఉట్టి పడేలా సెట్టింగులు ఏర్పాటు చేసి పలు వినోదాత్మక కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నా మన్నారు. మన ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ నినాదం ఇచ్చారని, ఆ ప్రేరణ తోనే ఈ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నారు. ఈ సంక్రాంతి సంబరాలు 11వ తేదీ శనివారం ముగ్గుల పోటీలు,12వ తేదీ ఆదివారం కోలాటం పోటీలు, 13వ తేదీ సోమవారం ఉదయం భోగి మంట, సాయంత్రం భోగి పండ్లు కార్యక్రమాలు ఉంటా యన్నారు.14వ తేదీ మంగళ వారం గాలి పటాల పండుగ నిర్వహిస్తామన్నారు .ఈ కార్య క్రమాల్లో ఆర్బిఐ, ఆర్థిక శాఖ అధికారులు పాల్గొని ఆహూతులకు పలు ముఖ్యమైన ఆర్థిక అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ప్రస్తుత రోజుల్లో బ్యాంకు వినియోగదారులు సైబర్ నేరాల భారిన పడి ఆర్థికంగా నష్ట పోతున్నారని అటువంటి సైబర్ ఆర్థిక నేరాల పట్ల బ్యాంకు వినియోగదారులు తీసు కోవాల్సిన పలు ముఖ్య మైన జాగ్రత్తలను ఆయా అధికారులు వివరిస్తారని తెలిపారు. ఈ సంబరాలకు అందరికీ ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త కృష్ణ ప్రసాద్, ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీరామ కోటయ్య, బీజేపీ నాయకులు లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన సామాజిక తనిఖీ బృందం

విశాలాంధ్ర - తగరపువలస: స్థానిక డా. బిఆర్ అంబేద్కర్ జి.వి.యం.సి ఉన్నత పాఠశాలను సామాజిక తనిఖీ బృందం గురువారం ఉదయం సందర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.స్వామి ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ బృందం పాఠశాల పరిసరాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. పాఠశాల గ్రంథాలయాన్ని, ప్రయోగశాలను, రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించారు. విద్యార్థులతో, ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాల గురించి తెలుసుకున్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకాన్ని పరిశీలించి వారు భుజించి సంతృప్తిని వ్యక్తపరిచారు. మధ్యాహ్నం పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులతో, విద్యార్థుల తల్లిదండ్రులతో, ఉపాధ్యాయులతో, స్థానిక విద్యావేత్తలతో గ్రామ సభ ఏర్పాటు చేసి పాఠశాల అవసరాలను, సర్వ శిక్ష అభియాన్ అందిస్తున్న పథకాలను గురించి చర్చించారు. భవిష్యత్తు అవసరాల గురించి పాఠశాలకు కావలసిన ఇతర సదుపాయాల గురించి ఉపాధ్యాయులు, సామాజిక తనిఖీ బృందం చర్చించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ ఇప్పాక వరలక్ష్మి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక తనిఖీ బృందం సభ్యులు బి. సతీష్, డి. తిరుమల రావు, ఎం.నాగరాజు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఎస్. జగదీష్, ఎస్.చిన్నమనాయుడు, బలరాం,రాధ, సత్యలక్ష్మి, శ్రీనివాసరావు, భవాని, మహాలక్ష్మి, అనసూయ, అప్పారావు, ప్రతాప్, మేరీ, రెడ్డిపల్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు ఓ చరిత్ర

భీమిలి ఎమ్మెల్యే గంటా

విశాలాంధ్ర - ఆనందపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2.10 లక్షల కోట్ల పెట్టుబడులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయడం చరిత్రగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అభివర్ణించారు. తన 30 ఏళ్ల రాజకీయ అనుభవంలో ఇంత భారీ పెట్టుబడులకు శ్రీకారం చుట్టడం ఇదే మొదటిసారని పేర్కొన్నారు. బోయపాలెం పైడా కాలేజీలో శరణ్య వెంకటేశ్వర స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం అనంతరం మీడియాతో మాట్లాడారు. విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేయడంలో భాగంగానే ఎన్నడూ లేనంత స్థాయిలో పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయని, దీని వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కృషి ఎంతగానో ఉందన్నారు. భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు 2026 జూన్‌లో అందుబాటులోకి వచ్చిన తర్వాత విశాఖపట్నం ముఖచిత్రమే మారిపోతుందని చెప్పారు. తిరుపతిలో జరిగిన ఘటన దురదృష్టకరమని, అందరినీ బాధతో కలచి వేసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్ని విషయాలను స్వయంగా సమీక్షిస్తున్నారని, బాధ్యులపై ఇప్పటికే ప్రాథమిక చర్యలు తీసుకున్నారని వివరించారు. జ్యుడీషియల్ విచారణలో మరిన్ని అంశాలు బయటకు వస్తాయన్నారు. పర్వదినాల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకునే సింహాచలంలో పటిష్టమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న లోడగలవానిపాలెం సర్పంచ్

విశాలాంధ్ర - ఆనందపురం: లోడగలవానిపాలెం సర్పంచ్ లోడగల రాజేశ్వరి రమణ దంపతులు శుక్రవారం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు నివాసంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. లోడగల రమణ రాజేశ్వరి దంపతులు గత సర్పంచ్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. అప్పుడు వైసిపి ప్రభుత్వం ఉండటంతో వైసీపీ పార్టీలోకి వెళ్లారు. ముందు నుండి టీడీపీ అభిమానులు కావడం వలన కూటమి ప్రభుత్వంలో గంటా శ్రీనివాసరావు శాసనసభ్యులు కావడంతో మరల సొంతగూటి టీడీపీ పార్టీలోకి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, జెడ్పీటీసీ సభ్యులు తాట్రాజు అప్పారావు, టీడీపీ సీనియర్ నాయకులు బమ్మిడి సూర్యనారాయణ, తారక్ సమక్షంలో లోడగలవానిపాలెం సర్పంచ్ లోడగల రమణ రాజేశ్వరితోపాటు ఉపసర్పంచ్ ఈగల నాగరాజు, మాజీ వార్డ్ నెంబర్ లోడగల శ్రీను తదితరులు పార్టీలో చేరారు. సర్పంచ్ మాట్లాడుతూ టీడీపీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

విశాలాంధ్ర - తగరపువలస: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని సిపిఐ, సిపిఎం సంబంధిత కార్మిక సంఘాలన్నీ ప్రధానమంత్రి మోడీ వచ్చిన సందర్భంలో ఉద్యమాలు చేపడుతుండగా అరెస్ట్‌లు చేయడం సరికాదని నేతలు వాపోయారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్‌పై మోడీ ఎలాంటి ప్రకటన చేయకుండా వెను తిరిగి వెళ్లిపోయారన్నారు. ఇది మోసపూరిత కుట్రగా భావిస్తూ స్టీల్ ప్లాంట్‌ని ఎలా కాపాడగలుగుతారని ప్రశ్నించారు. నిరసన తెలియజేసిన కార్మిక సంఘాల నాయకుల అరెస్టులు చేయడం సరికాదని, అరెస్టులతో ఉద్యమాల్ని ఆపలేరని, అరెస్టులు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని కోరారు.

నేనెప్పుడూ ప్రజల కోసం పని చేస్తా: గణబాబు

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 90వ వార్డ్‌కు ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు గణబాబు ఆదేశాల మేరకు కాకాని నగర్‌లో బి.టి సబ్ రోడ్ల నిర్మాణానికి 19.70 లక్షల జీవీఎంసీ వార్డ్ అభివృద్ధి నిధులు మంజూరు చేయించి వార్డ్ కార్పొరేటర్ బొమ్మిడి రమణ శుక్రవారం శంకుస్థాపన చేయించారు. అదేవిధంగా 90వ వార్డ్‌లోని కాకానినగర్‌లో అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న మొక్కపాటి సత్యనారాయణ కుటుంబానికి ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ శాసనసభ్యులు గణబాబు మొక్కపటి సత్యనారాయణ కుటుంబానికి రూ. 02,48,757/- రూపాయల చెక్కును అందజేసారు. ఈ కార్యక్రమంలో 90వ వార్డ్ అధ్యక్షులు యలమంచిలి ప్రసాద్, ఏఈ వెంకట లక్ష్మీ, వార్డ్ కార్యదర్శి కలిశెట్టి కానకరావు, వర్క్ ఇన్స్పెక్టర్లు రామకృష్ణ, కాకని నగర్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్ మోహన్, విమాన్ నగర్ అధ్యక్షులు గొట్టిపాటి సురేష్, కాకని నగర్ అసోసియేషన్ ప్రతినిధులు లలిత, ఈశ్వర్ కుమారి, రాధిక, రాణి, మురళి, నామాల చైతన్య, రమణ, స్థానిక నాయకులు రాం ప్రసాద్, ఏ.ఎస్.ఆర్ శ్రీను, శ్యామ్, ఉగంటేశ్వరావు, శ్రీ కాంత్, నాగు, సైదిశ్వరరావు, జోగారావు, తదితరులు పాల్గొన్నారు.

వెంకటాద్రికి పోటెత్తిన భక్తులు



విశాలాంధ్ర - పెందుర్తి: వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తరాంధ్ర తిరుపతి, పెందుర్తి వెంకటాద్రికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుండే వేలాది మంది భక్తులు ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. సుమారు 58 వేల భక్తులు స్వామివారి దర్శనానికి వచ్చారని ఆలయ ప్రధాన అర్చకులు మహర్తి రామానుజాచార్యులు, ఈవో నీలిమ తెలియజేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలకుండా అన్నిరకాల ఏర్పాట్లు చేసామని తెలిపారు. నగరానికి చెందిన మెడికవర్ హాస్పిటల్ సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించి భక్తులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. నాలుగు బస్సులను ఏర్పాటు చేసి కొండ పైకి ఉచిత వాహన సదుపాయం కల్పించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎమ్మెస్ రాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విశాలాంధ్ర విశాఖపట్నం
పేజి : 2
శనివారం 11, జనవరి 2025

భోగి మంటలు తారు రోడ్లపై వేయరాదు

– జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: నగరంలో ప్రజలు ఎంతో ఆనందంగా జరుపుకునే పండుగలలో భోగి పండుగ ప్రత్యేకమని, దాన్ని నగర ప్రజలు తారు రోడ్లపై వేయరాదని జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ శుక్రవారం పత్రికా ప్రకటన ద్వారా నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జివిఎంసి నిధులతో నగర ప్రజల సౌకర్యార్థం వేసిన రోడ్లపై భోగిమంటలు వేయడం ద్వారా రోడ్లపై తారు కరిగి రోడ్లపై గుంతలు ఏర్పడడం వలన నగర సుందరీకరణ కోల్పోవడమే కాకుండా, జివిఎంసికి ఆర్థిక నష్టం వాటిల్లుతుందని, అందువలన రోడ్లపై భోగిమంటలు వేయకుండా మైదానం లేదా ఖాళీ ప్రదేశాలలో ప్రజలు భోగిమంటలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. భోగిమంటలు రోడ్లపై వేయడం వలన వాహనదారులకు అసౌకర్యం కలగడమే కాకుండా ఎక్కువగా ప్రమాదాలు జరిగే అవకాశముందన్నారు. భోగి మంటలు తారు రోడ్డుపై వేసే వారిపై జరిమానా విధించడమే కాకుండా చట్టపరమైన చర్యలు చేపడతామని కమిషనర్ హెచ్చరించారు. భోగి మంటలు తారు రోడ్ల పైన, పార్కులలో ఏర్పాటు చేయకుండా ప్రజా ప్రతినిధులు, పలు సంఘాల నాయకులు, నివాసిత సంక్షేమ సంఘాలు, ఎన్జీవోలు సహకరించి రోడ్లను పాడుచేయకుండా ఔత్సాహికులకు అవగాహన కల్పించాలని కమీషనర్ విజ్ఞప్తి చేశారు.

అనిల్ అగర్వాల్ రివ్‌సర్‌సైడ్ స్టూడియో ట్రస్ట్‌ను సందర్శించిన లోక్‌సభ స్పీకర్

విశాలాంధ్ర– విశాఖపట్నం: 100 ఏళ్ల చరిత్ర కలిగిన రివర్‌సైడ్ స్టూడియో ట్రస్ట్‌ను కళ మరియు సంస్కృతిని ప్రోత్సహించేందుకు అత్యుత్తమ అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దాలన్న వేదాంత చైర్మన్ అనిల్ అగర్వాల్ దార్శనికతను గౌరవనీయ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కొనియాడారు. థేమ్స్ నదికి ఉత్తర ఒడ్డున ఉన్న ప్రఖ్యాత గ్లోబల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్‌లో జరిగిన సమావేశంలో బిర్లా మాట్లాడుతూ, ఈ స్టూడియో ప్రపంచవ్యాప్తంగా ఉన్న కళాకారులు మరియు ప్రదర్శనకారులకు వేదికను అందిస్తుంది. ఖండాంతరాలలో కళ, సంస్కృతి మరియు ఆవిష్కరణలను అనుసంధానించే ఒక ముఖ్యమైన చర్యలో, వేదాంత గ్రూప్ వ్యవస్థాపకుడు మరియు చైర్మన్ అనిల్ అగర్వాల్ ఇప్పుడు ఐకానిక్ రివర్‌సైడ్ స్టూడియోస్‌ను కలిగి ఉన్నారన్నారు. "ఇటువంటి ప్రతిష్ఠాత్మక వేదికపై కళ, సంస్కృతిని ప్రోత్సహించడంలో అగర్వాల్ చేసిన కృషికి ధన్యవాదాలు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కళాకారులు తమ ప్రపంచంలోని సంస్కృతిని మరియు కళలను ఇక్కడ లండన్‌లో ప్రదర్శించే అవకాశాన్ని పొందుతారన్నారు. "రివర్‌సైడ్ స్టూడియో ట్రస్ట్ అటువంటి కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించడానికి ప్రపంచ వేదికగా మారుతుందన్నారు. రివర్‌సైడ్ స్టూడియోస్‌ను క్రాస్-కల్చరల్ ఎక్స్ఛేంజ్‌కి చిహ్నంగా, కళలు, సంస్కృతి మరియు ఆవిష్కరణల రంగాలను సజావుగా ఏకీకృతం చేస్తూ ప్రశంసించారు.

ఇమ్‌టెక్స్, టూల్‌టెక్ ఎక్స్‌పోలకు రంగం సిద్ధం

విశాలాంధ్ర/విశాఖపట్నం: భారతదేశంలో తయారీ వ్యవస్థ ప్రాముఖ్యమైన పురోగతిని అనుభవిస్తోంది, ఇది భవిష్యత్తును ఆకృతులు చేస్తున్న అధునాతన టెక్నాలజీలతో ప్రయోజనపడుతోంది. ఇమ్‌టెక్స్ 2025, టూల్‌టెక్ 2025, డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ 2025, 23 నుంచి 29 జనవరి 2025 వరకు బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరుగనుంది. ఈ కార్యక్రమం పరిశ్రమ నాయకులు, టెక్నాలజీ అభిరుచి గల వారి కోసం అత్యుత్తమ వేదికను అందిస్తుంది. అక్కడ వారు మెషీన్ టూల్ పరిశ్రమలోని తాజా అభివృద్ధులను ప్రదర్శిస్తారు. 90,000 చదరపు మీటర్ల ప్రదర్శనస్థలంతో 8 హాళ్లలో ఇమ్‌టెక్స్ 2025 ఇప్పుడు వరకు అత్యంత పెద్ద ఆవృత్తిగా ఉండబోతుంది. ఈ ప్రదర్శన 23 దేశాల నుండి 1,100కి పైగా ప్రదర్శకులను అందిస్తుంది, ఇది మెషీన్ ప్రత్యక్ష ప్రదర్శనలు, కొత్త ఉత్పత్తి లాంచ్‌లు, మెషీన్ టూల్, డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్‌కు సంబంధించిన టెక్నాలజీ ప్రదర్శనలను చూపిస్తారు. జర్మనీ, ఇటలీ, జపాన్, కొరియా, స్పెయిన్, తైవాన్, అమెరికా వంటి దేశాలు వారి టెక్నాలజీ నైపుణ్యాలను ప్రదర్శించడానికి ప్రత్యేక పవిలియన్లతో పాల్గొంటున్నాయి.

చైతన్య స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర – పెదగంట్యాడ: పెద గంట్యాడ బీసి రోడ్డులో ఉన్న చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో సంక్రాంతి సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి నృత్యాలు చేశారు. భోగి మంటలు, గొబ్బెమ్మలు, రంగవల్లికలను అలంకరించారు. భోగి, సంక్రాంతి, కనుమ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. హరిదాసు కీర్తనలు లతో అందరిని అలరించారు. చిన్నారులకు భోగిపళ్లు పోసి సందడి చేశారు. ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా స్కూల్ ఆవరణలో సంక్రాంతి సంబరాలు కన్నుల పండుగగా చేపట్టారు. కార్య క్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కనక వల్లి, రామ చంద్ర రావు, మంచన్ పాఠశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు తది తరులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే సందర్భంగా నిస్సాన్ మోటార్స్ ప్రత్యేక రాయితీలు

విశాలాంధ్ర– విశాఖపట్నం: నిస్సాన్ మోటార్ ఇండియా తమ 'బోల్డ్ ఫర్ ది బ్రేవ్' రిపబ్లిక్ బొనాంజా ఆఫర్ ను ప్రారంభించింది. ఈ నెల గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని, అన్ని రక్షణ (భారత సైన్యం, భారత వైమానిక దళం %e% భారత నౌకాదళం), కేంద్ర మరియు రాష్ట్ర పోలీసు సిబ్బందికి వారి అత్యుత్తమ విక్రయ ఎస్ యు వి అయిన కొత్త నిస్సాన్ మాగ్నైట్ పై ప్రత్యేక ఆఫర్ లను అందిస్తుంది. సీ ఎస్ డీ కింద లభించే ప్రయోజనాలు మరియు పన్ను ప్రయోజనాన్ని (www.afd.csdindia.gov.in) ద్వారా ఎస్ యూ వీ ను బుక్ చేసుకోవడం పై పొందవచ్చు. భారతదేశం అంతటా కేంద్ర పారామిలిటరీ %e% రాష్ట్ర పోలీసు దళాల సిబ్బంది అందరికీ కూడా నిస్సాన్ ప్రయోజనాలను విస్తరించింది. నిస్సాన్ మాగ్నైట్ ను డిసెంబర్ 2020లో భారతదేశంలో విడుదల చేసినప్పటి నుండి దాని విభాగంలో ఒక ప్రసిద్ధ బీ ఎస్ యూ వీ సమర్థంగా మిగిలిపోయింది. దేశీయ మరియు ఎగుమతి మార్కెట్లలో 1.5 లక్షల యూనిట్ల సంచిత అమ్మకాలను దాటింది. ఈ అద్భుతమైన మైలురాయి భారత ఆటోమోటివ్ మార్కెట్లో గేమ్-ఛేంజర్గా నిస్సాన్ మాగ్నైట్ స్థానాన్ని పునరుద్ఘాటిస్తుంది. కొత్త నిస్సాన్ మాగ్నైట్ అక్టోబర్ 2024లో విడుదల చేసినప్పటి నుండి ఇప్పటికే 10,000 బుకింగ్ లు దాటింది.

విండ్‌ఫ్రీ ఎయిర్ కండిషనర్లను విడుదల చేసిన సామ్‌సంగ్

విశాలాంధ్ర – విశాఖపట్నం: నిద్ర దశల ప్రకారం ఉష్ణోగ్రతను సర్దుబాటు చేయడం ద్వారా రాత్రంతా ఆహ్లాదకరమైన నిద్రను ప్రోత్సహించడానికి సామ్‌సంగ్ 'గుడ్ స్లీప్' మోడ్‌ను ప్రవేశపెట్టింది. వినియోగదారులు తమ ఎయిర్ కండిషనర్‌లను వారి గెలాక్సీ వాచ్ సిరీస్‌తో కనెక్ట్ చేయడానికి మరియు వారు నిద్రలోకి జారుకున్నప్పుడు 'గుడ్ స్లీప్' స్వయంచాలకంగా సక్రియం చేయడానికి వీలు కల్పిస్తుంది. 'గుడ్ స్లీప్' మోడ్ ఒక వ్యక్తి నిద్ర పోతున్నప్పుడు ఇండోర్ ఉష్ణోగ్రతను హెచ్చుతగ్గులకు గురి చేస్తుంది. నిద్రలో 5 దశలు ఉంటాయి. ఒగెలాక్సీ వాచ్ సిరీస్‌తో కనెక్ట్ చేయడం వల్ల , వినియోగదారులు రిమోట్ ద్వారా మాన్యువల్ సర్దుబాట్లు లేకుండా 'గుడ్ స్లీప్' మోడ్ యొక్క ప్రయోజనాలను సజావుగా ఆస్వాదించవచ్చు. బెస్పోక్ ఏఐ విండ్‌ఫ్రీ ఏసీ, గెలాక్సీ వాచ్7 కాంబో ఆఫర్ 'గుడ్ స్లీప్'ను ప్రోత్సహించడానికి, సామ్‌సంగ్ ఆకర్షణీయ ఆఫర్‌ను ప్రవేశపెట్టింది. దీని ద్వారా వినియోగదారులు ఎంపిక చేసిన సామ్‌సంగ్ విండ్‌ఫ్రీ ఎయిర్ కండిషనర్‌లను కొనుగోలు చేయడంపై 42 శాతం వరకు తగ్గింపు పొందవచ్చు.

హిందూస్తాన్ షిప్ యార్డ్ ఉద్యోగులకు సన్మానం

విశాలాంధ్ర – మల్కాపురం: అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘ ఎన్నికల్లో విజయం సాధించిన హిందూస్తాన్ షిప్ యార్డ్ ఉద్యోగులను ఆ సంస్థ టి.ఎన్ .టియుసి నాయకులు గురువారం ఘనంగా సత్కరించారు. యూనియన్ కార్యాలయంలో కార్యాలయంలో ఏర్పాటుచేసిన సర్వసభ్య సమావేశంలో భాగంగా అఖిల భారత గిరిజన ఉద్యోగ సంఘం ఎన్నికల్లో ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలగంగాధర్ తిలక్, డైరెక్టర్లు సత్తిబాబు, శివ ఎన్నికైన వారికి యూనియన్ సభ్యులు అభినందనలు తెలిపి వారిని ఘనంగా సత్కరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఉరుకూటి మురళీధర్ రావు, జనరల్ సెక్రటరీ .ఎ . హెచ్ రాము, గౌరవాధ్యక్షులు యం.రమణ, కోశాధికారి జుంజూరు మహేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్నజీ, డిప్యూటీ సెక్రటరీ శ్రీ కర్రి అదిబాబు, తారక రామా వెల్ఫేర్ కమిటీ చైర్మన్ .జగదీష్ కుమార్ , నూకరాజు , కన్నబాబు, సతీష్ కుమార్ పరసూరాం,రాము, శ్రీను, మూర్తి, నాగేశ్వరరావు, మహాలక్ష్మి నాయుడు,టి ఎన్ టి యు సీ కుటుంబ సభ్యులు తదితరు లు పాల్గొన్నారు.

సాధుమఠం సత్యదేవుని సన్నిధిలో ముక్కోటి ఏకాదశి వేడుకలు

విశాలాంధ్ర – పెందుర్తి: మండలంలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రాంపురం సాధు మఠం వద్దగల శ్రీ రమాదేవి సమేత సత్యనారాయణ స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు సత్యనారాయణ స్వామిని ఉత్తర ద్వారంలో దర్శించుకొని ప్రత్యేక పూజాదికాలు జరిపించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు మురళీకృష్ణ, వారి కుమారులు రాజా, ఉపేంద్రలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పెందుర్తికి చెందిన వేగి శ్రీనివాసరావు మాట్లాడుతూ సత్యనారాయణ స్వామిని ఉత్తర ద్వారంలో వైకుంఠ దర్శనం చేసుకోవడం అదృష్టమని, అర్చకులు మురళీకృష్ణ, రాజా, ఉపేందర్ లు గుడిని ఎంతో అభివృద్ధి చేశారని కొనియాడారు. పండుగ సందర్భంగా ఆలయాన్ని అందంగా అలంకరించి భక్తులకు కనువిందు చేశారని పేర్కొన్నారు. కాగా పెందుర్తి ప్రాంత ప్రజలు సంతోషంగా ఉండేలా అనుగ్రహించమని రమాదేవి సమేత సత్యనారాయణ స్వామిని ప్రార్థించినట్లు శ్రీనివాసరావు తెలిపారు.

వైభవంగా ఉత్తర ద్వార దివ్య దర్శనం

విశాలాంధ్ర – భీమిలి: వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భముగా శ్రీ ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి వారి ఆలయ క్షేత్రంలో, ఉదయం 4:00 గం నుండి స్వామివారి ఉత్తర ద్వార దివ్య దర్శనం కలిగినది. భీమిలి పరిసర ప్రాంత 10,000 మంది భక్తులు స్వామి వారిని దర్శించి, తీర్థ ప్రసాదాలు సేవించి నారు. ఈ కార్య క్రమం ఆలయ అర్చకులు పురాణం శేషా శేషాచార్యులు, విష్ణు వారి పర్యవేక్షణలో జరుగగా, ఆలయ ట్రస్టీస్ కలిగొట్ల శ్రీరామ చంద్ర మూర్తి, కలిగొట్ల సూర్య నారాయణ మూర్తి,కలిగొట్ల భానోజీరావు, కలిగొట్ల శ్రీనివాసరావు, రఘునాథ్ రెడ్డి, శర్మ, వి తాతాజీ, వారి ఆధ్వర్యంలో కడు వైభవముగా జరిగినది.

జివిఎంసి టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 19 వినతులు

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం కి సంబంధించి 19 వినతులు వచ్చాయని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకరరావు తెలిపారు. శుక్రవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయం లోని సమావేశ మందిరం లో సిపి లు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ సిటీ ప్లానరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమం లో జీవిఎంసి పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ప్రజల నుండి అధికంగా ఫిర్యాదులు నమోదవుతున్నందున, ప్రతి శుక్రవారం జీవిఎంసి పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ప్రజల నుండి ఫిర్యాదులు/వినతులను స్వీకరించేందుకు గాను ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, చీఫ్ సిటీ ప్లానరు అన్నారు. టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమానికి జివిఎంసి కి సంబంధించి 19 వినతులు వచ్చాయని, అందులో ముఖ్యంగా 2వ జోన్ కు 04, 3వ జోన్ కు 06, 4వ జోన్ కు 02, 5వ జోన్ కు 01, 6వ జోన్ కు 03, 8వ జోన్ కు 03 వినతులు వచ్చాయని తెలిపారు. జీవీఎంసీ పరిధిలో ప్రజలు పట్టణ ప్రణాళిక విభాగమునకు సంబంధించి ఫిర్యాదులు, అర్జీలు మొదలైనవి ప్రతి శుక్రవారం నమోదు చేసుకోవచ్చున్నారు. వచ్చిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగు అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు.

అద్భుత మహిళలు నినాదంతో ప్రపంచ యాత్ర

– విశాఖ నుంచి మార్చి 8న ప్రారంభం

విశాలాంధ్ర – విశాఖ సిటీ: నగరానికి చెందిన సాహసికుడు భరద్వాజ్ దయాల మరోసారి ప్రపంచ యాత్రకు సిద్ధమయ్యారు. మార్చి 8 వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విశాఖ నగరం నుండి ప్రపంచ యాత్రకు భరద్వాజ్ బయలుదేరుతున్నారు. అద్భుతమైన మహిళలు అనే నినాదంతో తన యాత్రను ప్రారంభిస్తున్నారు. ప్రపంచంలోని ఏడు ఖండాలు, 195 దేశాలలో ఆయన పర్యటిస్తారు. ఈ పర్యటనలో పది లక్షల అద్భుతమైన మహిళల ఫోటోలను చిత్రీకరిస్తారు. ఆ ఫోటోలు ద్వారా ప్రపంచ వ్యాప్తంగా మహిళలు స్థితి గతులను తెలియజేసే ప్రయత్నం ఆయన చేపట్టారు. ప్రపంచంలో సగం ఉన్న మహిళలు ఎన్నో అద్భుతాలను సృష్టిస్తున్నారు. అదే సందర్భంలో ఎన్నో ఇబ్బందులు కూడా ఎదుర్కొంటున్నారు. ఈ అంశాలను ఫోటో ద్వారా ప్రపంచానికి తెలియజేసేందుకు భరద్వాజ్ ఈ యాత్రను చేపట్టారు. స్వతహాగా సినిమాటోగ్రాఫర్ అయిన భరద్వాజ్ ఐటీ రంగంలో లో కూడా ఉన్నారు. 2004లో మోటార్ సైకిల్ మీద భారతదేశ యాత్ర చేసిన భరద్వాజ్ 2006లో ప్రపంచ యాత్ర చేశారు. ప్రపంచ యాత్రలో ఐదు ఖండాలు 16 దేశాల మీదుగా 47 వేల కిలోమీటర్లు ప్రయాణం చేశారు. భారత యాత్ర రహదారి భద్రత గురించి చేస్తే, ప్రపంచ యాత్ర ప్రజలను చైతన్య పరుస్తూ ఓటు హక్కును వినియోగించుకోవాలంటే మన యాత్ర నిర్వహించారు. తాజాగా మహిళా శక్తి గురించి ప్రపంచానికి తెలియజేసేందుకు ఈ యాత్రకు సిద్ధమయ్యారు. ప్రపంచంలో ఉన్న మహిళలను ఒక తాటి మీదకు తీసుకువచ్చేందుకు తన ప్రయాణం ఎంతగానో ఉపయోగపడుతుందని, స్ఫూర్తి నింపుతుందని భరద్వాజ దయాల ఆశ భావం వ్యక్తం చేశారు. ఈ మేరకు వీ. జే .ఎఫ్. ప్రెస్ క్లబ్ లో శుక్రవారం పాత్రికేయులు సమావేశంలో తన పర్యటన వివరాలను వెల్లడించారు. ఒక్కొక్క దేశంలో అవసరమైన మేరకు సమయాన్ని కేటాయించి, అక్కడ మహిళలను కలుసుకొని వారి స్థితిగతులు, ఆర్థిక పరిస్థితి, కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలు గురించి తెలుసుకొని అందుకు అనువైన ఫోటోలు తీసుకుంటారు. మిలియన్ అమేజింగ్ ఉమెన్ పేరుతో చేపట్టిన ఈ సాహస యాత్ర విజయవంతం కావడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సొంత గడ్డ విశాఖ నుంచి ప్రపంచ యాత్ర మొదలు పెడుతున్నట్టు భరద్వాజ్ తెలిపారు. పాత్రికేయుల సమావేశంలో సీనియర్ జర్నలిస్ట్ ఎన్. నాగేశ్వరరావు, పర్యావరణవేత్త సోహన్ హట్టంగడి, సాహస మహిళ వైశాలి, జె.సి.ఏ. మహిళా విభాగం అధ్యక్షురాలు కలిక పాల్గొన్నారు.

విజయంతో తిరిగి రావాలి

– ఆంధ్ర అంధుల మహిళా క్రికెట్ జట్టుకు ఆల్ ద బెస్ట్ చెప్పిన ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ బాబు

విశాలాంధ్ర – పీఎం పాలెం: కేరళ రాష్ట్రంలోని కొచ్చిన్‌లో ఈ నెల 13వ తేదీ నుంచి 19 రాష్ట్రాలతో జరిగే జాతీయ స్థాయి అంధుల మహిళా క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఆంధ్ర జట్టు శనివారం విశాఖపట్నం నుంచి బయలుదేరనుంది. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) సహకారం, విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ కమిటీ ఆధ్వర్యంలో అంధుల మహిళా క్రికెట్ జట్టు వారం రోజులుగా విశాఖలో చేపట్టిన ప్రాక్టీస్ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా జట్టు సభ్యులు విశాఖ స్టేడియంలో ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ బాబును కలిశారు. ఈ సందర్భంగా ఆయన జట్టు సభ్యులను అభినందించి విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఏసీఏ తరఫున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. జాతీయస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొనే ఆంధ్ర మహిళా క్రికెట్ జట్టుకు వారం పాటు ప్రాక్టీస్ చేసేందుకు విశాఖపట్నం స్టేడియంలో అవసరమైన సదుపాయాలు కల్పించిన ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, కార్యదర్శి సానా సతీష్ బాబు ఇతర అపెక్స్ కౌన్సిల్ సభ్యులకు విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ కమిటీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ, సభ్యులు ఇల్లూరి అజయ్ కుమార్ రెడ్డి, సురవరపు రామన్ సుబ్బారావు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీఏ వైస్ ప్రెసిడెంట్ పి.వెంకట రామ ప్రశాంత్, కౌన్సిలర్ దంతు గౌర్ విష్ణు తేజ్, టీమ్ ఇండియా క్రికెటర్ కె.ఎస్.భరత్, ఆంధ్ర అంధుల మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ సత్యవతి, వైస్ కెప్టెన్ రమ్య, కోచ్ అజయ్‌రెడ్డి, అసిస్టెంట్ కోచ్ దుర్గారావ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ కాలనీ మురికివాడను పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ జోన్-5 లో గల శ్రీ కన్య థియేటర్ సమీపంలో గల ఇందిరా గాంధీ కాలనీ మురికివాడ ప్రాంతంలో నివాసితులకు అవసరమగు మౌలిక వసతులను కల్పించాలని జీవీఎంసీ అధికారులకు జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన 42 వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, జి వి ఎం సి అధికారులతో కలిసి ఇందిరా గాంధీ కాలనీ మురికివాడ నివాసిత ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ పరిశీలనలో కమిషనర్ ముందుగా ఇందిరా గాంధీ కాలనీ మురికివాడ ప్రాంతంలో నివాసముంటున్న 76 ఇళ్ల కుటుంబాలను పరిశీలించి ,నివాసితులతో మాట్లాడుతూ వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తవిటమ్మ అనేవ్యక్తులు అక్కడే నివాసితురాలుగా 50 సంవత్సరాలుగా కుటుంబంతో నివసిస్తున్నామని ,ఈ ప్రాంతంలో ఉన్న అందరికీ ఇళ్ల పట్టాలు అందించమని, వీధిలైట్లు వెలగక, కొన్ని మౌలిక సదుపాయాలు లేనందున నివాసితులు ఇబ్బంది పడుతున్నామని వివరిస్తూ ఆయా సమస్యలను పరిష్కరించాలని కమిషనర్ ను కోరారు. సుమారు 20 ఇళ్లకు వర్షాలు కారణంగా ప్రమాదాలు జరుగుతాయని కరెంటు సదుపాయాన్ని ఈపీడీసీఎల్ కల్పించలేదనని నివాసితులు కమిషనర్ కు తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా ఇందిరా గాంధీ కాలనీ మురికివాడలో 76 కుటుంబాలు నగరంలో కూలి పనులు చేసుకుంటూ నివసిస్తున్నాయని వారికి జీవీఎంసీ నుండి ఇళ్లపట్టాలను మంజూరు చేయాలని మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షురాలు ఎం.లక్ష్మి కమిషనర్ కు విజ్ఞప్తి చేశారు. అనంతరం మురికివాడ ప్రాంతాన్ని పరిశీలించిన కమిషనర్ వీధిలైట్లను వెంటనే వెలిగేలా, అలాగే అవసరమగు మౌలిక సదుపాయాలు కల్పించే చర్యలు వెంటనే చేపట్టాలని కార్యనిర్వాహక ఇంజనీర్లు తారా ప్రసన్న, మురళీకృష్ణ లకు, అలాగే ఆ ప్రాంతం యొక్క పూర్తి వివరాలు, నివాసితుల వివరాలను సమర్పించాలని ఏసిపి శాస్త్రి కు, డిసిఆర్ ఎస్.శ్రీనివాస్ లకు కమిషనర్ ఆదేశించారు. ఇళ్ల పట్టాల మంజూరు కు సంబంధించి ఇందిరాగాంధీ కాలనీ మురికివాడ ప్రాంతం యొక్క పూర్తి వివరాలను అధికారులతో, సంబంధిత కార్పొరేటర్, సంఘ నాయకులతో కూలంకుశంగా చర్చించి సమస్య పరిష్కార మార్గానికి త్వరలోనే చర్యలు చేపడతానని కమిషనర్ నివాసితులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎన్.వి నరేష్ కుమార్, జోనల్ కమిషనర్ వి.రాము, సహాయ వైద్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పందెం రాయుళ్లు అరెస్ట్

పట్టుబడ్డ 29 మందిపై కేసులు నమోదు

2 లక్షల 7 వేలు నగదు పట్టివేత



విశాలాంధ్ర – ఆనందపురం: సంక్రాంతి పండగ సమీపిస్తున్న వేళ ఆనందపురం మండలం శివారులలో కోడిపందాలు జోరందుకున్నాయి. విశాఖ సిటీ నలుమూలల నుంచి ఇక్కడికి పందెం రాయుళ్లు వచ్చి కొండ ప్రాంతం కాబట్టి ఎవరికి అనుమానం రాకుండా సొంత రిసార్ట్ దగ్గరగా కోడిపందాలను జోరుగా ఆడిస్తున్నారు. అందిన పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ సిఐ భాస్కరరావు, సిబ్బంది ఆధ్వర్యంలో ఆనందపురంలో శుక్రవారం పందెం రాయుళ్లను పట్టుకున్నారు. వివరాల్లోకెళ్తే మండలంలోని గండిగుండం – రామవరం రోడ్డులో శుక్రవారం పేకాటాడుతున్న 29 మందిని అదుపులో తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు,ఏసిపి అప్పలరాజు తెలిపారు. పేకాట, కోడిపందాలు ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్, స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడి చేసి 29 మందిని అదుపులో తీసుకొని వారి నుండి 2 లక్షల7 వేల రూపాయలు నగదు, 8 పందెం కోడి పుంజులను స్వాధీనపరచుకున్నట్లు ఏసిపి ఎస్ .అప్పలరాజు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆనందపురం పోలీస్ స్టేషన్ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఏసిపి మాట్లాడుతూ ఆక్రమంగా పేకాట, కోళ్ల పందాలు ఆడుతున్న వారిపై కఠినమైన చర్యలు చేపడతామన్నారు. ఎంతటి వారినైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలిపారు. ఇదిలా ఉండగా సుమారు 30 లక్షలకు పైగా పందెం సొమ్ము వద్ద నుండి దొరికినట్లు ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. రికవరీలో 2 లక్షలు 7 వేలు రూపాయలు చూపించడం ఆశ్చర్యం కలిగిస్తుందని ఏదేమైనా సరే ఎంతవరకు వాస్తవం అన్నది నిజా నిజాలు తేల్చాలని స్థానికులు చెబుతున్నారు. సత్కార్యక్రమంలో స్థానిక సీఐ చింతవానునాయుడు, ఎస్సై గంట్యాడ సంతోష్ ,తదితరులు పాల్గొన్నారు. కోడిపందాలలో పలువురు నాయకులు మాజీ శాసనసభ్యులు ఉండడంతో శుక్రవారం ఆనంద పురం పోలీస్ స్టేషన్ ప్రాంగణం రాజకీయ నాయకులతో నిండిపోయింది. ఏ వన్ ముద్దాయిగా వల్లభనేని రాధాకృష్ణ, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, పలువురు ప్రముఖులు ఉన్నట్లు తెలుస్తుంది. దీంతో శుక్రవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో పలువురు రాజకీయ నాయకులు, మంది మార్బలంతో స్టేషన్ వద్ద పెద్ద ఎత్తున హడావిడి చేశారు.

తిరుపతి తొక్కిసలాట ఘటనపై సిట్టింగ్ జడ్జ్‌తో దర్యాప్తు జరిపించాలి

విశాలాంధ్ర – విశాఖ సిటీ: తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనపై సిట్టింగ్ జడ్జ్ తో దర్యాప్తు జరిపించాలని వైసీపీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతిలో జరిగిన దురదృష్టకర ఘటన పట్ల విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ దురఘటనను పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కలగజేసుకొని సుమోటోగా కేసు నమోదు చేయాలని కోరారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. తిరుపతిలో జరిగిన ఘటనతో భక్తుల్లో భయాందోళనలు నెలకొన్నాయని, ఆ కారణం చేత నేడు సింహాచలంలో భక్తులు రద్దీ తగ్గిందన్నారు. ప్రభుత్వం వైఫల్యం వలనే ఆ దుర్ఘటన జరిగిందని, ప్రభుత్వ నిర్లక్ష్యం, అసమర్థత వలనే ఆరు నిండు ప్రాణాలు బలి అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ వరదల్లో కూడా మానవ తప్పిదాల వల్లనే ప్రజలు ఇబ్బందిపడ్డారని విమర్శించారు. అధికారులతో పని చేయించుకోవాలి గాని వారికి పార్టీ రంగులు ఊహించడం సరికాదన్నారు. ఇప్పుడున్న అధికారులందరూ టిడిపి ప్రభుత్వం నియమించిన వారేనన్నారు. ఒక ప్రాంతంలో ఉన్న డీఎస్పీ ని సస్పెండ్ చేస్తే మిగతా ప్రాంతాల అధికారులు మాటేంటని ప్రశ్నించారు. మరో రెండు ప్రదేశాల్లో తొక్కిసలాట జరిగిందని, ఆ అధికారులను ఎందుకు సస్పెండ్ చెయ్యలేదన్నారు. సీఎం చంద్రబాబు 8వ తేదీ వరకు కుప్పంలోనే ఉన్నా ఎందుకు సమీక్ష చెయ్యలేదన్నారు.